
నమస్తే తెలంగాణ
# నాగర్‌కర్నూల్
5 | మహబూబ్‌నగర్, మంగళవారం 11 ఫిబ్రవరి 2025 | NAGARKURNOOL

## దుర్యోధనుడిలా అరాచకాలు

కౌరవరాజు దుర్యోధనుడిలా ఏడాదిగా అరాచకాలు చేస్తున్న రేవంత్‌రెడ్డికి ఎదురొడ్డి కొడంగల్ ఆడబిడ్డలు, అన్నదమ్ములు పోరాడుతున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. ఏడాదిగా లగచర్ల, కొడంగల్‌లో కురుక్షేత్ర యుద్ధం నడుస్తుందని.. వారి పోరాటానికి బీఆర్ఎస్ మద్దతు ఇస్తుందన్నారు. 14 నెలల పదవీకాలంలో కొడంగల్‌లో రైతులు, మహిళలు, వృద్ధులు, యువత కోసం రేవంత్‌రెడ్డి ఒక్క పనికూడా చేయలేదన్నారు. కుటుంబ సభ్యులకు వందల వేల కోట్లు దోచిపెట్టడానికి కొడంగల్ భూములు ధారాదత్తం చేయడానికి రేవంత్‌రెడ్డి బ్రహ్మాండంగా పనిచేస్తున్నాడని విమర్శించారు. లంబాడీ ఆడబిడ్డలు గడప దాటి బయటకు రారు.. అలాంటి వాళ్లను ఢిల్లీ వెళ్లి న్యాయం కోసం అడిగేలా రేవంత్‌రెడ్డి దుర్మార్గంగా వ్యవహరించాడన్నారు. ఎకరం రూ.60-70 లక్షలు విలువ చేసే భూములకు రూ.10లక్షలు పరిహారం ఇవ్వడం ఏంటని అడిగినందుకు లగచర్ల రైతులపై అక్రమంగా కేసులు బనాయించారన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులను వదిలేసి కేవలం బీఆర్ఎస్ నేతలపైనే అక్రమంగా కేసులు పెట్టిన ఘనత కాంగ్రెస్‌కే దక్కిందన్నారు. కొడంగల్ రైతుల కోసం పట్నం నరేందర్‌రెడ్డి జైలుకు పోయిండు.. నీలా ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడానికి దొంగలా దొరకలేదన్నారు. అర్ధరాత్రి పోలీసులను ఊరు మీదికి పంపి లంబాడి ఆడబిడ్డలను రేవంత్‌రెడ్డి అవమానించాడన్నారు. బంజారా ఆడబిడ్డల పోరాటంతోనే లగచర్ల రైతులకు న్యాయం జరిగిందన్నారు. కొడంగల్ రైతుల భూ పోరాటానికి బీఆర్ఎస్ అండగా నిలబడిందని.. వచ్చే ఎన్నికల్లో కొడంగల్ ఆడబిడ్డలు రేవంత్‌రెడ్డిని చిత్తుచిత్తుగా ఓడిస్తారనీ కేటీఆర్ జోస్యం చెప్పారు.


రైతు నిరసన దీక్షకు హాజరైన కేటీఆర్, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు

బీఆర్ఎస్ శ్రేణుల్లో నూతనోత్సాహం



## మార్పు పేరుతో ఏమార్చారు

మార్పుమార్పు అని ప్రజలను ఏ మార్చిన తర్వాత ఇవాళ ఫలితం చూస్తున్నామని కేటీఆర్ అన్నారు. రాజకీయ భిక్షను ప్రసాదించిన కొడంగల్‌ను అవమానిస్తున్నాడు.. కొండలు, తొండలు గుడ్లు పెట్టని భూములంటూ రైతులు, గిరిజనులను అవమానిస్తున్న వ్యక్తి రేవంత్‌రెడ్డి అని పేర్కొన్నారు. ప్రపంచ స్థాయిలో కందిపప్పుకు గుర్తింపు తెచ్చింది కేసీఆర్ హయాంలోనే అని.. అలాంటి కందిపప్పు కొడంగల్, నారాయణపేట, వికారాబాద్ తదితర ప్రాంతాల్లో పండుతుందని ఈ విషయం సీఎం రేవంత్‌కు తెలియదన్నారు. జియో గ్రాఫికల్ ఐడెంటిటీని తీసుకొచ్చి కందిపప్పు దేశీయంగా పేరు తీసుకురాగా.. ఇప్పుడున్న సర్కారు కందులను కొనకుండా రైతులను అవమానిస్తుందన్నారు. తొండలు గుడ్లు పెట్టిన భూములైతే ఈ గుర్తింపు ఎలా వస్తుందని ప్రశ్నించారు.

## కేసీఆర్ హయాంలోనే అభివృద్ధి

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పదేళ్లలో ప్రతిఏటా అద్భుతమైన రీతిలో తెలంగాణ వ్యవసాయాన్ని తీర్చిదిద్దుకున్నామని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. రైతంటే చెమట చుక్కకు ప్రతిరూపం అన్నట్లు గౌరవం తీసుకొచ్చిన వ్యక్తి కేసీఆర్ అన్నారు. కష్టానికి విలువ తెచ్చిన నాయకుడు కేసీఆర్.. భూమికి విలువలు పెంచింది కేసీఆర్.. పంటలను పెంచిన నాయకుడు కేసీఆర్.. పంటలు కొన్న నాయకుడు కేసీఆర్.. కష్టానికి పెట్టుబడి ఇచ్చిన నాయకుడు కేసీఆర్ అని పేర్కొన్నారు.

# అబద్ధాలకోరు రేవంత్

- రాష్ట్రంలో నీ ఆటలిక సాగనీయం
- 'స్థానిక' ఎన్నికల కోసమే నీ డ్రామాలు
- దమ్ముంటే రాజీనామా చేసి మళ్లా గెలువు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- కోస్గిలో రైతు నిరసన దీక్ష.. హాజరైన మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ నాయకులు

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పచ్చి అబద్ధాల కోరని.. ఎన్నికల ముందు ఇచ్చిన ఒక్క హామీని కూడా అమలు చేయడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సోమవారం కొడంగల్ నియోజకవర్గం కోస్గిలో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అధ్యక్షతన బీఆర్ఎస్ రైతు నిరసన దీక్షలో పాల్గొని మాట్లాడారు. కొడంగల్‌లో పేదల ఓట్లతో గెలిచి ముఖ్యమంత్రి అయిన రేవంత్‌రెడ్డి ఇక్కడి ప్రజలకు చేసిందేమీ లేదని దుమ్మెత్తి పోశారు. ఎనుముల అన్నదమ్ములు, అదానీ, అల్లుడి కోసమే కొడంగల్ నియోజకవర్గంలో ఏడాది నుంచి కురుక్షేత్ర యుద్ధాన్ని తలపించేలా అరాచకాలు చేస్తున్నారని మండిపడ్డారు. తన మనుషులకు రూ.వేలకోట్ల విలువైన భూములను దోచిపెట్టడానికే లగచర్ల రైతులపై అక్రమ కేసులు బనాయించారని విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో చెప్పినట్టుగా హామీలను అమలు చేస్తున్నానని చెప్పుకుంటున్న రేవంత్‌రెడ్డి, రాష్ట్రంలో ఏ గ్రామానికి పోదామో చెప్పు.. ఒక్క గ్రామంలో వందశాతం పథకాలు అమలైతేగిట్ల ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని కేటీఆర్ సవాల్ విసిరారు.

**రుణమాఫీలో గోల్‌మాల్**

ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టాలని కొడంగల్‌తోపాటు తెలంగాణ మొత్తం ఎదురుచూస్తున్నదని కేటీఆర్ అన్నారు. లంకె బిందెలు ఉన్నాయి అనుకుని.. అడ్డమైన హామీలు ఇచ్చానని రేవంత్‌రెడ్డి చెప్పుకుంటున్నాడు.. ప్రభుత్వ ఖజానాలో లంకె బిందెలు ఉంటాయా అంటూ ప్రశ్నించారు. రైతు రుణమాఫీకి ఇచ్చే నిధుల విషయంలోనూ రేవంత్ ప్రభుత్వం గోల్మాల్ చేసిందన్నారు. మొత్తం రుణమాఫీకి రూ.49,500 కోట్లు అవసరమైతే కేవలం రూ.11వేల కోట్లు మాత్రమే ఇచ్చి ప్రభుత్వం గప్పాలు కొట్టుకుంటుందని..చారాన మందం కూడా రుణమాఫీ కాలేదన్నారు. తులం బంగారం ఇయ్యలేదు. స్కూటీ లేదు.. రుణమాఫీ చెయ్యలేదని ఎద్దేవా చేశారు. కేసీఆర్ 12సార్లు రైతుబంధు ఇచ్చిండు. రూ.73,000 కోట్లు రైతుల ఖాతాల్లో కేసీఆర్ వేశారన్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల ముందు కూడా రైతుబంధు కోసం రూ.7,600 కోట్లను జమచేస్తే ఎన్నికల కమిషన్‌కు బడే భాయ్ మోదీ, ఛోటే బాయ్ రేవంత్ రైతు బంధు వేయకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు వేయించుకోవడానికి నాలుగు నెలలు ఆపి రైతుబంధు పేరిట రైతుల ఖాతాల్లో వేసి ఎన్నికలయ్యాక నిలిపివేశాడన్నారు. ఇప్పు డు స్థానిక సంస్థలు ఎన్నికలు వస్తున్నాయంట మళ్లీ పథకాల



పేరిట జపం చేస్తున్నారని విమర్శించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు అయిపోయాయంటే రేవంత్‌రెడ్డి రైతుబంధు వెయ్యడుగాక వేయడన్నారు.

**ఎట్లా గెలిపించామో.. అట్లే ఓడగొడుదామని..**

జనవరి 26న కోస్గి గడ్డపై రైతుబంధు ఇస్తానని.. ఆత్మీయ భరోసా ఇస్తానని.. ఇందిరమ్మ ఇల్లు కట్టిస్తామని.. రేషన్ కార్డులు ఇస్తామని పథకాలు అమలు చేసి ఇయ్యకుండా ప్రజలను మోసం చేసింది సీఎం రేవంత్‌రెడ్డి అని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి దుయ్యబట్టారు. రేవంత్‌రెడ్డి మీద రైతులు, ప్రజలకు నమ్మకం పోయిందని.. ఎట్లా గెలిపించుకున్నామో.. ఇప్పుడు అట్లే ఓడగొడదామని కొడంగల్ ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. స్థానిక ఎన్నికల్లో రేవంత్‌రెడ్డికి బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. కోస్గి, లగచర్లలో ఏం జరిగిందో మీకు అందరికీ తెలుసు.. అక్కడ వద్దనుకున్న కంపెనీల్లో పొల్యూషన్ ఇచ్చే కంపెనీలను లగచర్లలో పెడదామని రేవంత్ ప్రయత్నించారన్నారు. కానీ లగచర్ల రైతులు రేవంత్‌కు తగిన బుద్ధి చెప్పారన్నారు. అందరూ అమాయకుల మీద అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపించారని.. ఓటు వేసిన పాపానికి రైతులను జైలుకు పంపించి వాళ్ల భూములు లాక్కునే ప్రయత్నం చేశాడని ఆరోపించారు. ఇక్కడ ఓటు వేసి ముఖ్యమంత్రిని చేసిన రైతులను జైలుకు పంపించిన ఘనత రేవంత్‌కు దక్కిందన్నారు. లగచర్ల రైతులను కేటీఆర్ కుటుంబ సభ్యులుగా ఆదుకుని జైలు నుంచి విడిపించుకొచ్చారన్నారు. ఒక్కో రైతుపై రెండు నుంచి నాలుగు కేసులు పెట్టిన కూడా కేటీఆర్ స్పందించి న్యాయ సహాయం చేశారన్నారు. అనేక ఇబ్బందులు పెట్టిన రైతాంగాన్ని ఆదుకున్న వ్యక్తి కేటీఆర్ అన్నారు. కొడంగల్‌లో బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి జరిగిందని.. దమ్ముంటే చర్చకు రావాలని సవాల్ విసిరారు. కేటీఆర్ దత్తత తీసుకున్నాక రూ.5వేల కోట్లతో కొడంగల్‌ను అభివృద్ధి చేశామన్నారు. కొడంగల్ నియోజకవర్గంలో మూడు దవాఖానలు కట్టినం.. సీఎం హయాంలో ఇప్పుడు ఆ దవాఖానల్లో సిబ్బంది లేదు.. మందుల్లేవన్నారు. అనంతరం పేట మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనపై ప్రజలకు విసుగు వచ్చిందన్నారు. దామరగిద్ద మండలం సబ్‌స్టేషన్ పేరుతో భూములు లాక్కుంటున్నారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, అంజయ్య యాదవ్, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్, నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్, బాల్కా సుమన్, పార్టీ నాయకులు సలీం, రామకృష్ణ, వెంకటనర్సింహులు పాల్గొన్నారు.



## కదం తొక్కిన గులాబీ దళం

- సీఎం ఇలాకాలో రైతు నిరసన దీక్ష సక్సెస్
- వేలాదిగా తరలివచ్చిన రైతులు, మహిళలు
- భారీ ర్యాలీతో కేటీఆర్‌కు ఘనస్వాగతం
- బిర్యానీలు పెట్టి.. మీటింగ్‌కు వెళ్లొద్దన్నా.. ఆగకుండా వచ్చిన కర్షకలోకం

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/మద్దూరు: సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గంలో గులాబీ దళం కదం తొక్కింది. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఏర్పాటు చేసిన రైతు నిరసన దీక్ష కనీవిని ఎరుగని రీతిలో సక్సెస్ అయింది. ఈ రైతు నిరసన దీక్షను భగ్నం చేయాలని కాంగ్రెస్ నాయకులు పన్నిన కుట్రలను ఛేదించుకుంటూ భారీ ఎత్తున రైతులు తరలివచ్చారు. కేటీఆర్ సభకు వెళ్లొద్దంటూ చాలా గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు పార్టీలతో సంబంధం లేకుండా కార్యకర్తలకు విందు భోజనాలు ఏర్పాటు చేశారు. చికెన్, మటన్ బిర్యానీలు పెట్టినా అక్కడ తిని కేటీఆర్ సభకు రావడంతో కంగుతిన్నారు. బీఆర్ఎస్ రైతు మహాధర్నా సక్సెస్‌ఫుల్ కావడంతో కాంగ్రెస్ పార్టీలో గుబులు రేగుతోంది. సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యుల అరాచకాలను కేటీఆర్ దుమ్మెత్తి పోశారు. కొడంగల్ జనంపై ప్రేమ లేదని.. కేవలం ఆయన అల్లుడికి, ఆదానికి, కుటుంబ సభ్యులకు దోచి పెట్టేందుకే గిరిజనుల భూములను లాక్కుంటున్నారని మండిపడ్డారు. కేటీఆర్ ప్రసంగిస్తున్నంత సేపు జనం కదలకపోవడం గమనార్హం. మధ్యాహ్నం ఒంటి గంటకు రైతుదీక్ష ప్రారంభమవుతుందని చెప్పినప్పటికీ 12గంటలకే రైతులు, మహిళలు పెద్దఎత్తున సభా ప్రాంగణానికి తరలివచ్చారు. ఒంటి గంటకే సభా ప్రాంగణ మొత్తం నిండిపోయింది. మరోవైపు కేటీఆర్ రాకకోసం కోస్గి పట్టణ శివారులో వేలాదిమంది రైతులు ఎదురు చూస్తున్నారు. సరిగ్గా మధ్యాహ్నం 3గంటలకు కేటీఆర్ లగచర్ల రైతులకు హకీంపేటలో సంఘీభావం ప్రకటించారు. అక్కడి నుంచి మొదలైన కేటీఆర్ ర్యాలీ సభకు వచ్చేవరకు 45 నిమిషాలు పట్టింది. ఎక్కడ చూసినా జనమే జనం. కేటీఆర్‌కు ఘన స్వాగతం పలికేందుకు పోటీపడ్డారు. దారి పొడవునా పూలు చల్లుతూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. కోస్గిలోని శివాజీ చౌక్‌లో కేటీఆర్‌కు భారీ గజమాలను వేశారు. డప్పులు, డాన్సులు చేసుకుంటూ కేటీఆర్‌ను తీసుకొచ్చారు. ఎండను సైతం లెక్కచేయకుండా రైతాంగం మొత్తం రోడ్లపై నిలిచిపోవడంతో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. సభా ప్రాంగణానికి చేరుకున్న కేటీఆర్ వేదిక మీదికి రావడానికి పదినిమిషాలు పట్టింది. అడుగడుగునా రైతులు, కార్యకర్తలు అభిమానం చూపించడంతో వేదిక ఎక్కడానికి సమయం పట్టింది.

**కేటీఆర్ వేలికి గాయం..**

కోస్గి మొత్తం జనసంద్రంగా మారడంతో కేటీఆర్‌ను చూసేందుకు పెద్ద ఎత్తున రైతులు తరలివచ్చారు. మహిళలు సైతం ఎదురు వెళ్లి ఆయనకు ఘనస్వాగతం పలికారు. దీంతో సభా వేదికకు చేరుకున్న కేటీఆర్‌కు కరచాలనం చేసేందుకు పోటీపడ్డారు. ఆయన చెయ్యిని చాలామంది పట్టుకొని షేక్ హ్యాండ్ కోసం ప్రయత్నిస్తుండడంతో ఓ కార్యకర్త గోరు తగిలి కేటీఆర్‌కు స్వల్ప గాయమైంది. రక్తం కారుతుండడంతో అలాగే వేదికపైకి వచ్చి.. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, సబితా ఇంద్రారెడ్డికి గాయాలు చూపించారు. తనకు గాయమైన విషయాన్ని కూడా కేటీఆర్ సభా వేదికపై ప్రస్తావించారు.

**భారీ బందోబస్తు మధ్య నిరసన దీక్ష**


కోస్గి నిరసన దీక్షకు పోలీసులు భారీ ఎత్తున మోహరించారు. కొడంగల్ నియోజకవర్గంలో కేటీఆర్ ఎంట్రీ అయినప్పటి నుంచి సభా వేదిక వద్ద వచ్చేవరకు పెద్ద సంఖ్యలో పోలీసులు మోహరించారు. లగచర్లకు వెళ్లకుండా భారీకేడ్లు అడ్డం పెట్టారు. అయితే లగచర్ల బాధితులంతా హకీంపేట వద్ద టెంటు వేసుకొని కేటీఆర్‌కు ఘన స్వాగతం పలికారు. మా భూములు మా నుంచి పోకుండా కాపాడండి సారు అంటూ గిరిజనులు వేడుకున్నారు. పోలీసు యంత్రాంగాన్ని భారీ ఎత్తున కొడంగల్ నియోజకవర్గంలో డిప్లయ్ చేశారు. అయినప్పటికీ కార్యకర్తలు ఎక్కడ సంయమనం కోల్పోలేదు.

**పాత్లావత్ 'భూమి'గా నామకరణం**

సీఎం రేవంత్ భూ దాహానికి ఎగిసిపడ్డ గిరిజన బిడ్డల పోరాటానికి మొక్కవోని దీక్షతో అడుగులో అడుగు వేసిన ఆ ఉద్యమ చైతన్య దీపిక పేరు జ్యోతి.. నిండు గర్భిణి అయిన జ్యోతి భూముల కోసం కలిసి కదం తొక్కినా కనికరించని సర్కార్ గిరిజనులపై అక్ర మ కేసులు బనాయించి జైలుపాలు చేశారు. నెలలు నిండిన బిడ్డకు జన్మనిచ్చే టైంలో.. భర్తను జైలు పాలు చేసినా పోరాటాన్ని ఆపలేదు. ప్రభుత్వ దమన నీతిని ప్రశ్నించింది. ఢిల్లీ వరకు వెళ్లి పోరాటం చేసి గిరిజనుల తరపున గళం విప్పింది. ఇటీవల జ్యోతి పండంటి ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. ఏ భూమి కోసం పోరాడిందో అ భూమిని తమ నుంచి వేరు చేయొద్దని తనబిడ్డకు అభిమాన నాయకుడు కేటీఆర్‌తో పాత్లావత్ భూమి నాయక్‌గా నామకరణం చేయించి చరిత్ర తిరగ రాసిం ది. ఈ ఘట్టం లగచర్ల పోరాటానికి ఊపిరిపోసింది.


### ఎక్కడో కాదు.. ఇక్కడికొచ్చి అడుగు

మా భూముల జోలికి వస్తే సహించేది లేదు.. ఎక్కడో ఉండి కాదు ఇక్కడికి వచ్చి మా జనాల మధ్య వచ్చి భూములు కావాలని అడుగు.. మేము ఇస్తామా? లేదా తర్వాత విషయం.. మేం మీకు ఓట్లు వేశాం మా బాధలు మీకు కనిపించడం లేదా? అంటూ రోటిబండ తండాకు చెందిన విద్యార్థిని మంజుల రైతు నిరసన దీక్షలో సీఎం రేవంత్‌ను నిలదీసింది. ఓట్లు వేయని వాళ్లు వచ్చి మాకు సపోర్ట్ ఇచ్చి మాట్లాడుతున్నారు.. నీవు ఎక్కడున్నావ్ సార్ అంటూ గట్టిగా నిలదీసింది. మీరు పెట్టిన కేసులో మా నాన్న ఇరుక్కున్నాడని వాపోయింది.



.. అలాగే రోటిబండ తండాకు చెందిన మరో విద్యార్థిని పూజ మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి సార్ ప్రజల బాధలు మీకు కనిపిస్తున్నాయా..? మీరు చీఫ్ మినిస్టర్ కాదు.. చీప్ మినిస్టర్‌లా వ్యవహరిస్తున్నారని ఆక్రోశం వెల్లగక్కింది. నీ మాటలన్నీ అబద్ధాలే.. మాకు ఎవరు డబ్బులు ఇవ్వలేదు.. మా కష్టం బాధను తెలుసుకున్న మా అన్న కేటీఆర్.. మమ్మల్ని ఆదుకున్నాడంటూ మాట్లాడింది. రేవంత్ సార్ మీకు ఓట్లేసినం మీరు ఎప్పుడైనా మా బాధలు గమనించారా? అంటూ నిలదీసింది.


రైతు దీక్షలో నినాదాలు చేస్తున్న మహిళలు


కోస్గిలో ప్రజలకు అభివాదం చేస్తున్న కేటీఆర్, పట్నం నరేందర్‌రెడ్డి


కేటీఆర్‌కు స్వాగతం పలికేందుకు ర్యాలీగా వస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## రేనివట్లలో ఉద్రిక్తత

- సీసీ రోడ్డు విస్తరణ కోసం ఇండ్లు కూల్చివేత
- 8 నిర్మాణాలు తొలగించిన అధికారులు
- నోటీసులు లేకుండా చేపట్టడంపై ఆగ్రహం
- ఇండ్లకు పరిహారం అందించాలని డిమాండ్


రేనివట్లలో రోడ్డు విస్తరణకు అడ్డంగా ఉన్న ఇండ్లను హిటాచీతో కూల్చివేయిస్తున్న అధికారులు

మద్దూర్, ఫిబ్రవరి 10 : కాంగ్రెస్ ప్రభుత్వంలో జనాలకు కూల్చివేతల భయం పట్టుకున్నది. ప్రజా సంక్షేమానికి పాటు పడుతామని చెప్పి అధికారంలోకి వచ్చిన ప్రజాపాలన ప్రభుత్వం ప్రజలకు చుక్కలు చూపుతోంది. ఇప్పటికే హైదరాబాద్‌తోపాటు పలు పట్టణాల్లో అక్రమ నిర్మాణాలంటూ కూల్చివేతలు కొనసాగగా.. ప్రస్తుతం గ్రామాల్లోనూ కొనసాగుతోంది. సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి ఇలాకాలో కూల్చివేతలు కొనసాగాయి. నారాయణపేట జిల్లా మద్దూరు మండలం రేనివట్లలో రోడ్డుకు అడ్డంగా ఉన్నాయని కొన్ని ఇండ్లను అధికారులు కూల్చివేశారు. రేనివట్లలోని దర్గా నుంచి ఎస్సీ కాలనీ మీదుగా మోమినాపూర్‌కు వెళ్లే 16 ఫీట్ల సీసీ రోడ్డును 27 ఫీట్లకు విస్తరించే పనుల్లో భాగంగా 8 ఇండ్లను జేసీబీతో కూల్చివేశారు. సుమారు 500 మీటర్ల వరకు నిర్మాణాలు కూల్చివేశారు. నోటీసులు ఇవ్వకుండా.. ముందస్తు సమాచారం లేకుండా ఒక్కసారిగా ఆర్ అండ్‌బీ అధికారులు హిటాచీతో గ్రామానికి చేరుకొన్నారు. రోడ్డు విస్తరణలో భాగంగా అడ్డంగా ఉన్న నిర్మాణాలను కూల్చివేసేందుకు వచ్చారు. దీంతో స్థానికులు అడ్డుకోవడంతో గ్రామంలో ఉద్రిక్తత ఏర్పడింది. నష్ట పరిహారం ఇవ్వకుండా ఇండ్లు కూల్చివేస్తే ఎలా అని నిలదీశారు. అందులో ఇతర పార్టీ నేతలు, పేదల ఇండ్లను కూల్చడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డు విస్తరించడం మంచిదే.. అందరికీ రవాణా సౌకర్యం బాగుంటుంది.. కానీ ముందస్తు సమాచారం ఇవ్వకుండా కూల్చివేతలు ఎలా చేస్తారని మండిపడ్డారు. ఇండ్లకు పరిహారం ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. కాగా గ్రామపంచాయతీగా ఉన్న రేనివట్ల పది రోజుల కిందట మున్సిపాలిటీగా మారింది. అయితే మూడు నెలల కిందట అధికారులు స్థానిక గ్రామపంచాయతీ అధికారులు గ్రామసభ నిర్వహించారు. అందులో రోడ్డు విస్తరణలో భాగంగా ఇండ్లు కోల్పోయే బాధితులకు ప్రభుత్వ పథకాలను అందిస్తామని చెప్పారు. ఈ క్రమంలో ఒక్కసారిగా ఉదయం అధికారులు గ్రామంలోకి చేరుకొని ఇండ్లను తొలగించారు. ఈ విషయమై మద్దూర్ మున్సిపల్ కమిషనర్ నాగరాజును వివరణ కోరగా నష్ట పరిహార విషయమై కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని చెప్పారు.

## రైతులకు న్యాయం చేకూరేలా పోరాడుదాం

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి


రైతులతో మాట్లాడుతున్న ఎస్ఆర్‌రెడ్డి

నారాయణపేట, ఫిబ్రవరి 10 : నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల సర్వేలో భాగంగా పేట నియోజకవర్గంలోని దామరగిద్ద మండలంలోని దామరగిద్దతండాలో గిరిజనులకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా వారి భూములను లాక్కునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందని, రైతులకు న్యాయం జరిగేలా పోరాటం చేస్తామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో దామరగిద్దతండాకు చెందిన గిరిజన రైతులు మాజీ ఎమ్మెల్యేను కలిసి సమస్యను విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎత్తిపోతల పథకంలో భాగంగా దామరగిద్దతండాలో గిరిజనుల భూమిలో పంప్‌హౌస్, సబ్‌స్టేషన్ నిర్మాణం చేపడుతామని చెబుతున్నారని, వేరే ప్రాంతంలో భూ సేకరణ చేయాలని చెబుతున్నా వినకుండా భయపెట్టి భూములను లాక్కునే ప్రయత్నం చేస్తుందన్నారు.